ఆర్పీల దారుణం

- పొదుపు సంఘాలను చిదిమేస్తున్న వైనం
- రుణం మంజూరుకు పర్సంటేజీల డిమాండ్
- ఎవరికీ చెప్పుకోలేని స్థితిలో సంఘాల మహిళలు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు


మహిళ సంఘం సమావేశం (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొదుపు సంఘాలు నేడు ఆర్పీల కారణంగా మనుగడ సాగించలేకపోతున్నాయి. ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతూ వారు ఒకరిపై ఆధారపడ ఉండకుండా ఉండాలని, ఆర్థికంగా ఎదగాలనే చూస్తుంటే, ప్రవేశపెట్టిన పథకాలు ఆర్పీలకు వరాలుగా మారాయి. అడిగినంత ఇస్తేనే రుణం మంజూరు లేకుంటే ఎందుకు ఇవ్వాలన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మహిళలు వాపోతున్నారు.

- పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం రుణాలు ఇస్తుంటే దళారుల్లా ఈ ఆర్పీలు పొదుపు సంఘాల మహిళలకు చేరకుండా అడ్డుకుంటున్నారు.
- ప్రభుత్వం మహిళా సంక్షేమం కోరుతూ ఈ ఆర్పీలను నియమించారు. మీరు మాత్రం మహిళా సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దళారుల్లా వ్యవహరిస్తున్న ఆర్పీలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

రాజకీయ పార్టీ సమావేశాలకు..

- పొదుపు సంఘాల మహిళలకు రుణాలు ఇప్పిస్తూ, వారి నుంచి రూ.5 నుంచి 6 వేలు వసూలు చేస్తున్నారని మహిళా సంఘం సభ్యులు సాక్షికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.
- తాను రుణం మంజూరు కోసం రూ.6 వేలు చెల్లించినట్లు ఓ సభ్యురాలు తన గోడు సాక్షికి చెప్పుకుంది. ఆర్పీలు పార్టీలకతీతంగా వ్యవహరించాలన్న నిబంధన ఉన్నా ఒక్కో ఆర్పీ ఒక్కో పార్టీకి మద్దతు ఇస్తున్నారని, వారు పిలిచినప్పుడు పార్టీల సమావేశాలకు వెళ్లాలని పటాన్‌చెరు సర్కిల్–22 లో, మండలాల్లో, మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి నెలకొందని వాపోయింది.

సంఘాల వివరాలు...

- పటాన్‌చెరు మండలంలో 1312, అమీనాపూర్ మండలంలో 227, జిన్నారం మండలంలో 513, గుమ్మడిదల మండలంలో 661 సంఘాలు ఉన్నాయి.
- జీహెచ్‌ఎంసీ సర్కిల్– 22లో మూడు డివిజన్లలో 1,431, అమీన్‌పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలు కలిపి మొత్తం 1,050, పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 5,194 మహిళా సంఘాలు ఉన్నాయి.
- అలాగే ఆర్పీలు సర్కిల్–22లో మూడు డివిజన్లలో కలిపి 58 మంది, పటాన్‌చెరు మండల పరిధిలో 44 మంది, అమీన్ పూర్ మండలంలో 8 మంది, గుమ్మడిదల మండలం 22 మంది, జిన్నారం మండలంలో 19 మంది ఉన్నారు.
- మున్సిపాలిటీలైన అమీన్‌పూర్‌లో 22 మంది, బొల్లారంలో 8 మంది, తెల్లాపూర్‌లో 14 మంది ఉన్నారు.

వసూలు చేస్తే కఠిన చర్యలు

మహిళా సంఘాల నుంచి ఆర్పీలు డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆర్పీలు, సీఓల ద్వారా రుణాలకు సంబంధించిన పత్రాలు బ్యాంకుకు వెళ్తాయి. ఇప్పటి వరకు డబ్బులు వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై విచారణ జరిపిస్తా. ఆర్పీలు డబ్బుల వసూలకు పాల్పడి ఉంటే చర్యలు తీసుకుంటా.

– పుణ్యవతి, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ మేనేజర్

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావాలి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరముందని, ఇందులో భాగంగా వినూత్న వ్యవసాయ పద్ధతులపైన రైతులకు అవగాహన పెంచాలని గ్రోవెరో టెక్నాలజీస్ వ్యవస్థాపకులు పీజే శ్రీకాంత్ తెలిపారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, ఆహార భద్రత పైన మరింత కృషి చేయడానికి ఏర్పాటు చేసిన వ్యవసాయ సాంకేతిక సంస్థ 'గ్రోవెరో టెక్నాలజీస్'ను ఆదివారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ., సంస్థ ఆధ్వర్యంలో రైతుల పంట ఉత్పాదకతను పెంచడమే లక్ష్యంగా పెట్టుకుందని, అంతేకాకుండా వ్యవసాయం, డేటా ఆనలిటిక్స్, అధునాతన సాంకేతికత నిపుణుల బృందంతో వినూత్న పరిష్కారాల ద్వారా రైతులను బలోపేతం చేయనున్నామన్నారు.



తాము రూపొందించిన రియల్ టైమ్ డేటా రైతులను శక్తిమంతం చేయడమే కాకుండా, పంట దిగుబడి పెంచి, పెట్టుబడి ఖర్చును తగ్గించడానికి దోహదపడుతుందని సంస్థ సీఈఓ వేముల సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సేల్స్ హెడ్ భాస్కర్ వున్నా, బిజినెస్ హెడ్ వైఎస్‌వీ ఉమాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. నడిగడ్డతాండలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెనకబడిన వర్గాలు గత 40 సంవత్సరాల నుంచి నివాసముంటున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, మంజీరా పైపు లైన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో దశరథ్ నాయక్, రత్నకుమార్, మోహన్ నాయక్, దేవనూరి నర్సింహ, కృష్ణానాయక్, చాకలి రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.


కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఫుట్‌బాల్ విజేత లయోలా గుంటూరు జట్టు



రాయదుర్గం: సీబీఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్–19 విజేతగా లయోలా గుంటూరు జట్టు నిలిచింది. గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్ మైదానంలో సీబీఎస్‌సీఈ స్కూల్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్–2023ని నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం అండర్–19 ఫుట్‌బాల్ ఫైనల్లో లయోలా గుంటూరు జట్టు– హెచ్‌పీఎస్ బేగంపేట్ జట్ల మధ్య జరగగా లయోలా గుంటూరు జట్టు 1–0 స్కోరుతో విజయం సాధించింది. ఈ విజేతలకు ఆగస్టు చివరి వారంలో గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు టమాట రూ.35, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 25, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 220, వెల్లుల్లి 150.

ఆర్టీసీ బస్‌పాసుల వివరాలు

రాయదుర్గం: టీఎస్‌ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అందిస్తున్న స్నేహపూరిత రాయితీ బస్‌పాస్‌ల వివరాలు.

బస్‌పాస్ రకం	టారిఫ్
జనరల్, ఆర్డీనరీ, మెట్రో	రూ.1,150–రూ.1,350
స్టూడెంట్, జనరల్	రూ.450
ఎన్‌జీఓస్, ఆర్డినరీ, మెట్రో	రూ.450–రూ.60

శిల్పారామం సందర్శన వేళలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామం ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. వారాంతంలో సాయంత్రం 5.30 గంటల నుంచి శిల్పారామంలోని ఆంఫీథియేటర్‌లో సందర్శకుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఫీజుల ఇలా

పెద్దలకు	రూ.60
పిల్లలకు.	రూ.20
బోటింగ్ ఛార్జీలు	రూ.30

- బ్యాటరీ ఆపరేటెడ్ కారు చార్జీలు రూ.15
- ఎడ్లబండి ఒక్కరికి ఛార్జీలు రూ.20

నేడు జీఎల్‌ఐటీలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

రాయదుర్గం: పాలిసెట్–2023 ఫలితాల వెల్లడితో రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ)లో అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించడంతో ఇక సందడి వాతావరణం కనిపించనుంది. రాష్ట్రంలో ఏకైక గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ విద్యాసంస్థ కొనసాగుతోంది. దీంట్లో చదివిన వారందరికీ ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో ఈ ఇన్‌స్టిట్యూట్‌కు మరింత ప్రాధాన్యత నెలకొంది.

- రాయదుర్గంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీలో సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశంపై ఈ అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ అవగాహనా కార్యక్రమంలో 24 కోర్సుల గురించి వివరించడంతో జీఐఎల్‌టీలో నిర్వహించే కోర్సులు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరిస్తారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రఘునాథ్ యాదవ్

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో రఘునాథ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ.. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వారందరికీ ఉచితంగా వైద్యం అందించడం కోసం శిబిరం నిర్వహించామన్నారు.శిబిరంలో పాల్గొన్న వారికి గౌతమ్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గౌతమ్ వైద్య పరీక్షలు పలు సూచనలు, సలహాలు చేశారు.

ఇంద్రధనుష్.. అదుర్స్




మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జెనిత్ కిడ్స్ ఆధ్వర్యంలో ఇంద్రధనుష్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు నేహాభార్గవ, ఆకాష్, అనయ, ప్రవ్యా, మిహికా వేదాంతికా, కృతికా, బింధు గీసిన 25 చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. –గచ్చిబౌలి

ముగిసిన మహిళా ఉత్పత్తుల ప్రదర్శన

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన మహిళల ఉత్పత్తుల ప్రదర్శన ఆకర్షణీయంగా మారింది. చేతివృత్తులు, కలంకారి చిత్రలేఖనం, కొండపల్లి బొమ్మలు, నిర్మల్ కొయ్యబొమ్మలు, పెంబర్తి జ్ఞాపికలు, నకాసి పటాలు, చిత్రలేఖనంతో కూడిన చీరలు, వస్త్రాలు అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. 29 రాష్ట్రాలకు చెందిన మహిళా పారిశ్రామికవేత్తలు, చిన్నతరహా కుటుంబ పరిశ్రమల ప్రతినిధులు ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. మాదాపూర్‌లోని శిల్పారామంలోని కళావేదికలో 100 స్టాళ్లను ఏర్పాటు చేసి తాము ఉత్పత్తి చేసిన వాటిని ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషనర్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు తలుచుకుంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తారన్నారు. శిల్పారామంలో మహిళలచే నిర్వహించబడిన ఉత్పత్తుల ప్రదర్శనే దీనికి నిదర్శనం అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో 29 రాష్ట్రాలకు చెందిన కళాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సావిత్రీబాయి పూలే మహిళా సంఘం అధ్యక్షురాలు బెల్లం మాధవి, జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్రకుమారస్వామి పాల్గొన్నారు.


వకుళాభరణంకు జ్ఞాపిక ఇస్తున్న మహిళా ప్రతినిధులు

ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలి


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: పాపారెడ్డి నగర్ కాలనీ శ్రీ వీరాంజనేయ శివాలయం ప్రాంగణంలోని కమ్యూనిటీ హాలులో ఆదివారం పాపిరెడ్డినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్త దాన శిబిరం, ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, సిఐ క్రాంతి కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవ చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఎన్‌సి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రమేష్, వివేకానందనగర్ డివిజన్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానించిన ఆలయ ప్రతినిధులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

గచ్చిబౌలి: వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సాగింది. ఆదివారం కొండాపూర్ డివిజన్‌లోని సిద్ధిఖీనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన, నాగదేవతలు, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం చేసిన తర్వాత భక్తులను దర్శనం కల్పించారు.

సామాజిక సేవలో ముందుండాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం పెరగాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్‌సొసైటీ కాలనీలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజికసేవలో ఉండే ఆనందం ఎందులోనూ ఉండదన్నారు. సమాజం మాకు ఏమి ఇస్తుందని ఆలోచించకుండా సమాజానికి నేను ఏమి చేస్తున్నాను అన్న సమున్నత లక్ష్యంతో యువత ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్పనగేష్, సీఐ నరేందర్‌రెడ్డి, నాయకులు ఆదర్శ్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి

అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓడీఎఫ్ కాలనీ, సాయి భగవాన్ కాలనీలలో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సాయికృపా కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అలాగే ఇంటింటికి రక్షిత మంచినీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు బిజిలి రాజు, అనిరుధ్ రెడ్డి, కృష్ణ, నవనీత జగదీశ్, చంద్రకళ గోపాల్, రాములు, బాలమణి బాలరాజు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్ష

- పటాన్‌చెరు పరిధిలో ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 1173 మంది గైర్హాజరు


తనిఖీ చేసి కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలో గ్రూప్–1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గ్రూప్–1 పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులతో రద్దీ నెలకొంది. పరీక్ష రాయడానికి వచ్చిన వారిని సిబ్బంది తనిఖీలు చేసి కేంద్రంలోకి అనుమతించారు. మొత్తం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 2832 మందికిగాను 1659 హాజరయ్యారు. 1173 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి వచ్చినప్పటికీ ఒరిజినల్ ఐడీ ప్రూఫ్ తీసుకు రాకపోవడంతో వారు వెనుదిరగాల్సి వచ్చింది. అలాగే పటాన్‌చెరు సెయింట్ జోసెఫ్ స్కూల్ వద్ద ఓ అభ్యర్థిని పది నిమిషాలు ఆలస్యంగా రావడంతో అధికారుల పరీక్ష కేంద్రానికి అనుమతించలేదు. కేంద్రాల వద్ద పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

నూతనంగా రోడ్డు వేయించాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి అండూర్ వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు నీరుడి వీరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అండూర్ రోడ్డు అధ్వాన్నంగా మారిందని, మండలంలోని అన్ని రోడ్లు డబుల్ రోడ్లుగా మారుతున్నా అండూర్ రోడ్డు మాత్రం అభివృద్ధికి నోచుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సోలక్‌పల్లి క్రాస్ రోడ్డు నుంచి అండూర్ వరకు నూతనంగా రోడ్డును వేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం



శంకుస్థాపన చేస్తున్న మధుసుదన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీల అభివృద్ధికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామ పరిధిలోని సాయి దర్శన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న చిల్డ్రన్ పార్క్, దేవాలయం, కమ్యూనిటీ హాల్, కాలనీ ముఖద్వారం నిర్మాణ పనులకు ఆదివారం స్థానిక కాలనీవాసులతో కలిసి మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిదర్శన్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సహకారంతో నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వెంకటరావు, కాలనీవాసులు జగదీశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వరద కాలువ కబ్జా కాకుండా చూడండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వరద కాలువలు కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని మాజీ నీటి సంఘం చైర్మన్ నరసింహ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెరువులు, వరద కాలువలు యథేచ్ఛగా కబ్జాల పాలవుతున్నాయని, ఇటీవల తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువలు పూర్తిగా కబ్జాలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. అదేవిధంగా ఇరిగేషన్ అధికారులు ఇష్టానుసారంగా ఎన్‌ఓసీలను ఇస్తున్నారని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వరద కాలువలో పేరుకుపోయిన మట్టిని తీయాలని కోరారు. వరద కాలవల కబ్జాలపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


వరద కాలువను చూపుతున్న నరసింహ

పాఠశాలల పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

పటాన్‌చెరు టౌన్: పాఠశాలలు పునఃప్రారంభం నేపథ్యంలో పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈఓ పీపీ రాథోడ్ తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ పీపీ రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను సమకూర్చినట్లు తాగునీరు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు శుభ్రం చేయించి పాఠశాలల పున: ప్రారంభానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులందరూ పాఠశాల పునః ప్రారంభం రోజు విద్యార్థులకు ఉచిత యూనిఫాం పుస్తకాలను స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేతుల మీదుగా పంపిణీ చేయాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభం నేపథ్యంలో తల్లితండ్రులు తమ పిల్లలను సకాలంలో పాఠశాలకు పంపాలని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే తల్లితండ్రులు పాఠశాలల్లో చేర్పించకముందే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్నటువంటి పాఠశాలల్లో మాత్రమే తమ పిల్లలను చేర్పించాలని కోరారు. గుర్తింపులేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించినట్లయితే విద్యాశాఖ బాధ్యత వహించదని తెలిపారు. ఇప్పటికీ అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల యజమానులు త్వరగా జిల్లా విద్యాధికారి ద్వారా అనుమతి పొందాలని సూచించారు. రెన్యువల్ చేయించుకోలేని పాఠశాలలు కూడా త్వరలో దరఖాస్తు చేసుకొని రెన్యువల్‌కు అనుమతి పొందాలన్నారు. లేనిపక్షంలో జిల్లా విద్యాధికారి ఆదేశాలతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.


వీకర్ సెక్షన్‌లో ప్రభుత్వ పాఠశాలను సందర్శిస్తున్న ఎంఈఓ పీపీ రాథోడ్